# ఆరిపోయే దీపం

"ఈ విషయంలో మా సహాయం కంటే భగవంతుని దయ చాలా ముఖ్యం.'

"అంతే నంటారా డాక్టర్?"

"అంతకంటే నేను చెప్పగలిగింది, చేయగలిగింది ఏం లేదు. ఈసారికేం భయంలేదు కాని ఒకటి రెండు నెలల్లో మళ్ళీ ఇలాగే జబ్బు చేస్తుంది. అప్పుడు నయమవటం కష్టం."

"...."

ఆ పిల్లదానిని ఈ విషయం చెప్పి ఖంగారు పెట్టకండి కాని తన సన్నిహితు లెవరైనా ఉంటే వాళ్ళను పిలిపించండి. నా శక్తివంచన లేకుండా చేస్తాను. ఆ పైన దేముడి దయ."

"డాక్టర్..."

"పెద్దవారు. మీరే అధైర్యపడితే ఎల్లా? నేను రేపు మళ్ళీ వస్తాను."

తను నిద్రపోతున్నదని అపోహలో మావయ్య, డాక్టరు మాట్లాడుకున్న మాటలివి. నిజమే!! నిజంగా నిద్దరపోతే ఎంత బాగుండేది...! కాని ఇంతకాలం తను పోతున్నది పెద్ద మొద్దునిద్దర. ఇటునుంచి అటు పక్కకి వత్తిగిల్లి చూస్తే గులాబీపూలు వాడిపోతూ కనిపించాయి. తనది వాటిది ఒకటే బతుకు.... పుట్టినంతసేపు పట్టదు వాడిపోడానికి.

చిన్నప్పుడు ఒకసారి ఇల్లాగే అయింది. ఆ రోజున నాన్న మాట్లాడకుండ తన గదిలో ఏడుస్తూ కూర్చున్నాడు. కానీ తనను కారణం అడిగే ధైర్యం లేకపోయింది.

తరువాత చాలరోజుల వరకు అనుక్షణం తననే అంటిపెట్టుకొని ఒక క్షణం కూడా వదలకుండా ఉండేవారు. కాని పిన్ని రాకతో ఈ అనురాగం, ఆదరణ తన నుంచి దూరం కావడం మొదలుపెట్టాయి. నాన్న ఏ ఉద్దేశ్యంతో పిన్నిని వివాహం చేసుకున్నారో అది నెరవేరలేదు. తనకు తల్లిలేని లోపం తీరకపోవటమే కాకుండా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే తండ్రి కూడా పరాయివాడయ్యాడు. అది ఎవరి లోపం? తనది మాత్రం కాదు. తను ఎంత నెమ్మదిగా ఉన్నా పిన్ని ఈసడించి కొట్టేది.

ఒకరోజు ఏం జరిగిందో తెలియదు. బహుశా తను చేసిన చిన్నతప్పుకే పిన్ని తనని చీకటి గదిలో పెట్టి తాళం వేసింది. ఏడ్చినా, అరిచినా, బ్రతిమాలినా తన మొర ఆలకించే వాళ్ళే లేకపోయారు. ఏం జరిగిందో తనకి తెలియలేదు. అల్లా ఎన్ని గంటలు ఆ చీకటి గుయ్యారంలో ఉందో? కళ్లు తెరిచి చూసేసరికి నాన్న తన వంక జాలిగా బాధతో చూస్తున్నారు. తనకి పెద్దపెట్టున ఏడుపు వచ్చింది. తన జీవితంలో ఏదో తీరని లోటుందని ఆనాడు తెలిసింది.

కొద్ది రోజుల అనంతరం నాన్న ఒకరోజున "కమలా! మదరాసు వెళదాం వస్తావా?" అని అడిగాడు. తను వెంటనే "పిన్ని వస్తుందా?" అని అడిగింది. "రాదు" అని ఆయన సమాధానం ఇచ్చిన వెంటనే "అయితే వెళదాం" అంది.

తనకి జ్ఞానం వచ్చాక ప్రయాణం చెయ్యటము అదే మొదటిసారి. సెకండ్ క్లాసులో ప్రయాణం ఎంత హాయిగా వుంది. మదరాసులో అడుగుపెట్టగానే తనకి ఎనలేని ఆశ్చర్యం, అంతులేని భయం వేసాయి. ట్రాములు, కారులు, ఆ జనం, వాళ్లు మాట్లాడే విచిత్రమైన భాష యివన్నీ తనలో అనేక భావాలని కలుగజేసాయి. టాక్సీలో తను, నాన్న మావయ్యగారింటికి వచ్చారు. మావయ్య ఇల్లు తనకి స్వర్గంలాగా కనిపించింది. మావయ్య ఎంత మంచివాడు- తనంటే ఎంత ప్రేమ-మూర్ మార్కెట్‌లో తనక్కనిపించిన బొమ్మలన్నీ కొనిచ్చేవాడు తన కోసం. ఇంటికంటే ఇక్కడెంత హాయిగా వుంది! ఇక్కడ తన ఇష్టంవచ్చినట్టుండవచ్చు. ఈసడించి, కసిరికొట్టేవాళ్లెవరూ లేరు. నాన్న తనని ఒంటరిగా మావయ్య దగ్గర వదిలి తను ఊరు వదిలిపోయాడు. ఆరోజంతా తనకేం తోచలేదు. ఏడుస్తూ కూర్చుంది. మావయ్య ఎంత సముదాయించినా తను మానలేదు. చివరికి ఇద్దరూ కలిసి కారులో సముద్రతీరానికి వెళ్లారు. అక్కడ జనం, సముద్రమూ వీటన్నింటినీ చూస్తూ తనని తాను మరిచిపోయింది. తనూ, మావయ్యా ఒంటరిగా మిగిలిపోయారు.

చూస్తూ ఉండగా పదిహేను సంవత్సరాలు గడిచిపోయాయి. ఈనాడు తను ఆనర్స్ ఫైనల్ చదువుతోంది. కాని ఇన్ని సంవత్సరాలలోను తనకి మావయ్య తప్ప ఎవ్వరూ సన్నిహితులు కాలేకపోయారు. ఎందుకని తనతో అందరూ స్నేహంగా వుంటూనే తననుంచి చాల దూరంగా ఉంటారు? బహుశా అది తన లోపమై ఉంటుంది. ఎదుటివాళ్ళని లెక్కచెయ్యకపోవటం ఎంతమాట పడితే అంత తను అనెయ్యగలుగుతుంది. తమలో తప్పు ఉండటం వల్ల తనని ఎవ్వరు ఏమీ అనడం లేదు. కాని తనని ఎవ్వరూ ప్రేమించడమూ లేదు.

బహుశః గోపాల్ తనని ప్రేమిస్తున్నాడేమో! అతన్ని మాత్రం తను ఏం గౌరవించింది. అతని మంచితనాన్ని ఎన్నిసార్లు హేళన చెయ్యలేదు? కొందరు

వ్యక్తులు మనల్ని ఎందుకు ప్రేమిస్తున్నారో మనకు తెలియదు. మనలోని ఏ లక్షణాలు వాళ్ళని ఆకర్షించాయో కూడా చెప్పలేను. కాని మనం ప్రేమిస్తున్న వ్యక్తులు మనల్ని ప్రేమిస్తుంటే వాళ్లయందు స్నేహానికి అనురాగానికి బదులు అసహ్యం, అలక్ష్యం కలుగుతాయి. గోపాల్ తన యెడల చూపే అనురాగాన్ని నిర్లక్ష్యం చేసింది.

తన జీవితంలో తను సాధించేదేమిటి? తనకి చివరికి మిగిలిందేమిటి? బహుశః గోపాల్ ప్రేమ ఒకటే కావచ్చు. ఈ దివ్వె ఏనాడు ఆరిపోతుందో ఎవరికీ తెలియదు. ఈలోపల తన జీవితాన్ని మాధుర్యంతో నింపెయ్యాలి. తన ఒంటరితనాన్ని ఎలాగైనా సరే తొలగించెయ్యాలి. చావంటే తనకు భయం లేదు. కాని దాన్ని చిరునవ్వుతో అంగీకరించాలంటే మనస్సులో మారుమణిగని కోరికలేవీ ఉండకూడదు. తనకు ఈనాడు ఉన్న కోరికల్లా ఒక్కటే- ప్రేమ. ఎవరినైనా మనసారా ప్రేమించాలి. ఎవరిచేతనైనా హృదయపూర్వకంగా ప్రేమించబడాలి. తను ప్రేమించలేక పోవడానికి కారణం? ప్రేమని గురించి ఎన్ని గంటల తరబడి ఉపన్యాసాలిచ్చే తన స్నేహితురాళ్ళని చూస్తే చాలా ఆశ్చర్యం వేసేది? వాళ్ళు నిత్యం ఘోషపెట్టే ఆ ప్రేమ అనేది ఏమిటి? ఏమిటో తెలిస్తే యింకేం! ప్రపంచాన్ని ఏలవచ్చు. వచ్చిన చిక్కల్లా తనకు తెలియకపోవడమే....

తను వెళ్లిపోయిన తరువాత మావయ్య ఎలా ఉంటాడో! నాన్నకు ఎంత బాధ కలుగుతుందో? మావయ్యను చూడకపోతే తనకు తోచదు. ఆయనకు సేవ చెయ్యడం అంటే తనకు చాల యిష్టం. అన్ని వేళల ఆయనకు నచ్చిన సౌకర్యాలు చేయడం తన మనస్సుకు నచ్చిన పని. తను మావయ్యను ప్రేమిస్తోందా? మావయ్యంటే తనకు చాల యిష్టం. అంతే.

ఒకరోజు సాయంత్రం తను సరళని కలుసుకోడానికి వాళ్ళ యింటికి వెళ్ళింది. సరళ గదిలో కనిపించలేదు. బహుశః యింట్లో ఏమైనా పని ఉందేమోనని తను పుస్తకం ఒకటి తీసి పేజీలు తిరగవెయ్యటము మొదలుపెట్టింది. కాని ఏమీ చదవాలనిపించలేదు. పుస్తకం బల్లమీద పడేసి కిటికీ దగ్గరకి వచ్చి నిలుచుంది.

ఇంటిచుట్టూ వున్న తోట్లోకి చీకటి మెల్లగా ప్రవేశించింది. తను యథాలాపంగా తోటలోకి చూసింది. తోటలో ఎవరో కుర్రవాడు, సరళ ఉన్నారు. ఆ కుర్రవాడు సరళని ముద్దుపెట్టుకొంటున్నాడు. ఆ దృశ్యం చూడగానే తన మనస్సు పరిపరి విధాల పోయింది. అనేక భావాలు మనస్సులో కలిగాయి. అన్నిటికంటే అసహ్యం ఎక్కువగ కలిగింది. ఆ రోజు నుంచీ సరళ, తను వేరువేరు మార్గాలవెంబడి నడవసాగారు. సరళ ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకుంది. గమ్యస్థానాన్ని చేరుకుంది. తన శుష్క జీవితానికి ఈనాడు ఉన్న ఆధారమల్లా ఒక్కటే.... గోపాల్.

గోపాల్ మెరినాలో నడుస్తూ వస్తూంటే సముద్రపు పొరని చీల్చుకుంటూ ఒక మెల్లని కంఠం తన ఒక్కడికే వినపడింది. 'గోపాల్' అని ఎవరో పిలుస్తున్నారు. తను వెనక్కి తిరిగి చూసాడు. ఆ కంఠం అల్లంత దూరంలో కన్పడింది. కాని తను మాత్రం అటు సాగలేకపోయాడు. కాని మనస్సు మాత్రం వెయ్యి గొంతుకలతో 'కమలా' అంది. బహుశః తన మాట వినపడింది కాబోలు! కమల తనవైపే నడచి వస్తోంది. అస్తమించే సూర్యునికి సముద్రానికీ మధ్య లేత పసుపు చీరె, నీలం పట్టు జాకెట్టుతో కమల తనని చూస్తూ చిరునవ్వు నవ్వుతూంది. ఎందుకని? తనని ఇంకోసారి హేళన చెయ్యడానికా! చురుకుగా ముందుకు అడుగు వేసాడు. 'గోపాల్' అని మళ్ళీ ఆ కంఠమే పిలిచింది. ఆ కంఠంలో కన్నీరు ధ్వనిస్తోంది. వెనక్కి తిరిగి చూసాడు. ఎప్పుడూ అల్లరి చేసే కమల కళ్ళు దీనంగా తన వంక చూస్తున్నాయి. కట్టతెంచుకు రావటానికి కన్నీరు సిద్ధంగా ఉంది. "కమలా" అంటూ ఆ పిల్లదాని వైపు అడుగువేసాడు. "గోపాల్" అంటూ కమల అక్కడే నుంచుంది. ఒకరినొకరు సమీపించారు. కానీ ఏం మాట్లాడాలో తెలియక ఇద్దరూ ఒకరివంక ఒకరు చూసుకొని చివరికి సముద్రం వంక చూసారు. మెల్లిమెల్లిగా వాళ్ల నీడలు చీకటిలో కలిసిపోతున్నాయి.

"కాలేజీ నుంచా?" అడిగింది.

"ఔను. నువ్వు రావటంలేదే?"

"ఒంట్లో బాగుంటం లేదు?"

"ఏం? డాక్టరును కలుసుకున్నావా? ఏమన్నాడు?"

"అవన్నీ తరువాత చెబుతాను గాని అల్లా తిరిగి వద్దాం రా."

గోపాల్ కమల వెంట నడుస్తున్నాడు. మనస్సులో సంతోషం, దుఃఖం ఒకేసారి కలిగాయి. ఎన్నాళ్ళికి ఇన్నాళ్ళుగా తను ఎదురుచూస్తున్న సుదినం నేడు వచ్చింది. కమల తన ప్రేమని స్వీకరించింది. ఈనాడు భయం, సంకోచం లేకుండా తను కమల ప్రక్కన నిలబడ్డాడు. కాని కమల చాల చిక్కిపోయినట్లు అనిపిస్తోంది. ఏం సుస్తీ చేసిందో ఏమో? కమల ఉంటే తనకేం లోపం లేదు. "ఇప్పుడు ఒంట్లో కులాసాగా ఉందా?" అని అడిగాడు. "నీతో మాట్లాడటానికి చాలా భయపడేవాడిని. నువ్వు చేసే అల్లరితో నా మనస్సు చాలా బాధపడేది. కాని ఏం జరిగినా నీ యందు నాక్కోపం వచ్చేది కాదు.

"నేను చాలా చెడ్డదాన్ని."

"కాదు కమలా! బాధని గుర్తించే అనుభవం నీకు ఇంకా లేదు."

"నాకు బాధ అంటే తెలియదు.

"కొందరి అదృష్టం అదే! వారి కష్టసుఖాలకు అతీతులు కాగలరు."

కమలకి పెద్ద పెట్టున నవ్వు వచ్చింది. 'ప్రేమలో వున్న వాళ్ళు ఇలాగే మాట్లాడుతారా?' అని అనుకుంది. వీటితో పాటు గోపాల్ మాటల వల్ల తన మనస్సుకి ఏదో అర్థం కాని ఆనందం కలుగుతోంది.

"నవ్వుతున్నావేం?" అని అడిగాడు గోపాల్.

"నిన్ను చూచి కాదు. నీ మాటలు వింటుంటే నాకు చాలా ఆనందం కలుగుతోంది."

"నిజం!"

"నిజమే. పద మా యింటికి వెళదాం."

నిజంగా ఆరోజు నుండి వాళ్ళ జీవితాల్లో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. గోపాల్ తెచ్చిన పూలు కమల జడలోంచి ప్రపంచాన్ని హేళన చేస్తుంటే ఆ పిల్లది కుట్టిన జేబురుమాళ్లు అతని హృదయానికి అతి దగ్గరగ వుండేవి. బొటానికల్ గార్డెన్స్ వాళ్ల నిశ్శబ్దంలో భాగస్వామి అయితే సముద్రుడు వాళ్ళ హాసపరిహాసాలకు చెలికాడు అయ్యేవాడు. చిలకా గోరింకల్లాంటి ఆ జంటని అనేక జంటల కళ్ళు ఈర్ష్యతో, ఆశ్చర్యంతో చూసి వాళ్ళకి దిష్టి కలిగించేవి. రోజులు ఎక్కడికో పరుగెత్తుకుపోతున్నాయి. ఆనాటికానాడు కమల, గోపాల్‌కు మధ్య దూరం అతి వేగంతో తరిగిపోతోంది. కాని మధ్యమధ్యన ఒక ప్రశ్న, ఒక సందేహం, ఒక శంక మనసులో మసలేది. ఆకాశాన్ని అందుకోవడానికి అర్రులు చాచే ఈ ఆనందాన్ని ఒక క్షణం కలతపెట్టేది. ఈ ఆనందం ఏనాడైనా అంతమైతే ఈ సుఖ సాగరం ఏ ఎడారిలోకన్నా ప్రవహించి ఇసుకలో ఇంకి మటుమాయమైతే... తమ జీవితాలకు చివరికి మిగిలేదేమిటి.

ఏమిటి? అదే ప్రశ్న.... కాని ఒకరినొకరు కలుసుకోగానే ఈ సందేహాలు నివృత్తి అయ్యేవి. భయాలు దూరంగా పారిపోయేవి. మన సుఖాలు, జీవితాలు శాశ్వతంగా ఉంటాయనే ధైర్యం చేకూరేది. ఆ ఉల్లాస శిఖరంతో భూత, భవిష్యత్, వర్తమానాలు సమ్మిళితమై, ఐక్యమై కాలాన్ని నిశ్చలం చేసేవి. జీవితమే ఒక మహాస్వప్నం అయ్యింది.

కాని స్వప్నం కలకాలం ఉంటుందా? మన యిష్టాయిష్టాల నిమిత్తం లేకుండా అది ఏనాడో ఒకనాడు అంతమై తీరుతుంది. గోపాల్‌ను కలుసుకోవడానికి వెళుతుండగా కమలకు వళ్ళు భారంగా తోచింది. టెంపరేచర్ చూస్తే నూటఒకటి ఉంది. డాక్టర్ చెప్పిన రోజు దగ్గరకు వచ్చిందన్న మాట. తనకున్న బట్టల్లోకి అందమైన తెల్ల పట్టుచీర, వెల్వెట్ జాకెట్, రవ్వల నెక్లెస్‌తో అలంకరించుకొని బయలుదేరింది. జ్వరంతో ముఖం కెంపు వన్నె వచ్చింది. మెల్లిగా సముద్ర తీరం చేరింది. చేతిలోని కదంబం దండ తనవేపు చాచాడు. రోజుకి మల్లే తన చెయ్యి

చాచలేదు. తల్లో పెట్టమని వెనక్కి తిరిగి నుంచుంది. తలలో పువ్వులు పెట్టి మెల్లగా ముంగురులు సరిదిద్దాడు.

"కమలా! ఇవాళ నువ్వు చాలా బాగున్నావు."

గోపాల్ చేతులు మెల్లిగా చుట్టుకున్నాయి. తన శరీరం అతని కౌగిలిలో ఇమిడిపోయింది. అతని పెదిమలు తన బుగ్గని తాకి తన పెదిమలను కప్పివేశాయి. ఇది సముద్ర తీరం. ఆ ప్రాంతంలో అనేక మంది ఉన్నారనే భావమే కలుగలేదు. మనస్సులో కలిగిందిల్లా ఒక్కటే భావం.... ఈ మధుర క్షణం శాశ్వతంగా ఉండిపోవాలి.

"కమలా! నేనంటే నీకు ప్రేమేనా?" అని గోపాల్ అడిగాడు. దానికి సమాధానంగా కమల అతని పెదిమలు ముద్దుపెట్టుకుంది.

"నన్ను వివాహం చేసుకుంటావా?" అని గోపాల్ ఇంకో ప్రశ్న వేసాడు.

దానికేం జవాబు లేదు. తన ముఖం అతని హృదయంలో దాచుకుంది.

మళ్లీ యిదే ప్రశ్న వేసాడు. కమల తలఎత్తి అతని కళ్లల్లోకి చూసి మెల్లిగా "చేసికోను" అని అంది. ఈమాట అతనికి కొరడాదెబ్బలా తగిలింది.

నిశ్చేష్టుడై అలా నిలబడిపోయాడు.

"ఎందుకని?" అని అడిగాడు.

సమాధానం శూన్యం.

"నేను అందగాడిని కానా? నీ అంతస్తుకి సరిపోనా?" ఈ మాటలు కొంచెం కోపంగానే వచ్చాయి.

కాని కమల కొంచెం నెమ్మదిగానే సమాధానం ఇచ్చింది. "గోపాల్! నాకు తెలిసిన మనుష్యులందరిలోకి నువ్వే మంచివాడివి. కాని నిన్ను వివాహం చేసుకోలేను.

"ఇదంతా నాకేం అర్థం కావటం లేదు."

"అర్థం అయ్యేలాగా నే చెబుతాగా. కూర్చో. చూడు గోపాల్! కొందరి జీవితంలో ఆనందం చాలా ఆలస్యంగా వస్తుంది. నిజంగా అది అందుబాటైన రోజున దాన్ని వాళ్ళు అనుభవించలేరు."

"నీ మాటలేం నాకు తెలియటం లేదు."

"నా చెయ్యి ముట్టుకు చూడు."

"ఇదేమిటి జ్వరం వచ్చినట్టుంది."

"ఇవాళ జ్వరం వచ్చింది. రేపు దగ్గు వస్తుంది. ఎల్లుండి కమల అయిపోతుంది."

"కమలా! ఎందుకు నన్ను ఇట్లా బాధపెడతావు."

"లేదు గోపాల్! ఈరోజున నీ దగ్గర కడసారిగా సెలవు తీసుకుందామని వచ్చాను."

"అవేం మాటలు కమలా!"

"అవే నిజమైన మాటలు. నేను చెప్పినదంతా విన్న తరువాత నీకు దీనర్థం బోధపడుతుంది. నాకు చిన్నప్పుడు ఒకసారి జబ్బు చేస్తే డాక్టరుకు చూపించారుట. ఆయన చాలా పెద్దవాడు. ఈ పిల్లకు ఒక ప్రక్క గుండెకు రంధ్రం వుందట. ఆపరేషన్ చేస్తే నయమవుతుందని నమ్మకమేమీ లేదని ఆయన చెప్పాడు. ఇప్పుడేం భయం లేదు. పదిహేను సంవత్సరాల తరువాత ఆపరేషన్ చెయ్యవచ్చని ఆయన అన్నాడు. ఈ ఇరవై సంవత్సరాలు సాఫీగా గడచిపోయాయి. కాని రెండు నెలల క్రితం ఒకసారి యిలా వచ్చింది. అప్పుడు డాక్టర్ మా మావయ్యతో చెప్పాడు. ఇంకోసారి యిలా వస్తుందని అప్పుడు బ్రతకనని డాక్టర్లు దీంట్లో చెయ్యగలిగిందేమీ లేదని ఆయన చెప్పాడు. ఈనాడు జ్వరం ప్రారంభమైంది."

"అన్నీ అబద్ధాలు."

"అలా అనుకున్నా నిజం దాగదు."

"పద. పెద్ద పెద్ద డాక్టర్ల దగ్గరకు వెళదాం."

"నన్ను చూసింది ఆ పెద్ద డాక్టర్లే."

"ఇంగ్లాండ్, అమెరికా, ప్రపంచంలో ఎక్కడ డాక్టర్లనైనా పిలిపిద్దాం."

"వద్దు గోపాల్! ఇదంతా అనవసరం. నువ్వు చెప్పినట్లు వాళ్ళు ఇక్కడికి వచ్చేసరికి నేను చాలా దూరంలో ఉంటాను."

"అలా అనొద్దు కమలా!"

"అనను గోపాల్! నేను శాశ్వతంగా వుంటా."

గోపాల్ ఏం మాట్లాడలేదు. రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. కమల అతని తలను తన హృదయానికి హత్తుకుంది.

బయట ప్రపంచం వీళ్లతో ఏం సంబంధం లేకుండా తన దోవని అది పోతోంది. సముద్రంలో జోరు ఏ మాత్రం తగ్గలేదు. మామూలుగానే చందమామ మబ్బుతునకలతో దోబూచులాడుతున్నాడు. హైకోర్టుమీది లైటు దూరంగా పోయే ఓడలకి తన ఉనికిని మామూలుగానే చెబుతోంది. జనం మెల్లిమెల్లిగా ఇళ్ళకి తిరిగి బయలు దేరారు.

మెరీనాలో సముద్రానికి తోడుగా ఇద్దరు మిగిలారు- కమల, గోపాల్!

*- కృష్ణా పత్రిక, 10-1-1956*